సాక్షి
జోగులాంబ గద్వాల
ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



మళ్లీ రెస్క్యూ ఆపరేషన్
ఎస్ఎల్‌బీసీ సొరంగంలో నిపుణుల సూచన మేరకు రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నారు.
వివరాలు IIలో ▸



విశేష స్పందన
ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) చేపట్టిన రాములోరి తలంబ్రాలకు విశేష స్పందన లభించింది.
వివరాలు IIలో ▸

గరిష్టం/కనిష్టం
45.1 /27.7

వాతావరణం
ఉదయం నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోత పెరుగుతుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

బాధితులకు అండగా ఉండాలి



గద్వాల క్రైం: జిల్లాలో పోక్సో కేసుల నమోదు, బాధితులకు అందిస్తున్న సేవలపై శనివారం సాయంత్రం గద్వాల జిల్లా అదనపు సెషన్ కోర్టు, పోక్సో కోర్టు జడ్జి ఎస్ రవికుమార్ భరోసా సెంటర్‌ను తనిఖీ చేసి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భరోసా సిబ్బంది శిరిష, స్రవంతి పలు విషయాలపై జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. జడ్జి వారితో మాట్లాడుతూ జిల్లాలో లైగింక దాడులకు గురైన మైనర్ బాలికల కేసులు, నిందితులకు శిక్షపడే విధంగా తీసుకున్న చర్యలపై ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. వేధింపులకు గురైన క్రమంలో వారిలో ఆత్మస్థైర్యం, నమ్మకం, చట్టాలపై కల్పిస్తున్న విషయాలను ఆరా తీశారు. భరోసా సెంటర్ ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలను, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది ఎంతో బాధ్యతతో విధులు నిర్వహించి మనోధైర్యం కోల్పోయిన బాధితులకు అండగా ఉండలన్నారు. నిపుణులైన వైద్యులు, డాక్టర్లు, లాయర్లు, కౌన్సెలింగ్ సిబ్బంది ద్వారా ప్రభుత్వం బాధింపపడ్డ బాధితులకు భరోసా ఇవ్వలనే ధృఢసకల్పంతో ఈ సెంటర్‌లను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. అనంతరం సెంటర్‌లోని వివిధ విషయాలపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భరోసా సిబ్బంది శ్వేత, కీర్తి, కవిత తదితరులు ఉన్నారు.

రాజ్యాంగ నిర్మాతను అవమానించిన కాంగ్రెస్



గద్వాలటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌కు సముచిత గౌరవం ఇవ్వకపోగా.. ఆనాటి కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రంగా అవమానించారని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. అంబేద్కర్ శత జయంతి ఉత్సవాలలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 1952 లోక్‌సభ ఎన్నికల్లో అంబేడ్కర్‌ను ఓడించేందుకు ఆనాటి కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు కలిసి నారాయణరావ్ కథరోల్కర్‌ను పోటీకి నిలిపియని, నెహ్రూ స్వయంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి అంబేడ్కర్ ఓటమికి కారకులయ్యారని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోడీ హయాంలో అంబేడ్కర్ స్మృతివనం, పంచతీర్థ పేరుతో ఆయన పుట్టిన స్థలం, నివసించిన స్థలం, దహన సంస్కారాలు నిర్వహించిన స్థలాలను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. బీజేపీ మాత్రమే అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విద్యాసాగర్ రెడ్డి, రామంజనేయులు, డీకే స్నిగ్ధారెడ్డి, రామచంద్రారెడ్డి, రవికుమార్‌ఏక్బోటే, బండల వెంకట్రాములు, అక్కల రమాదేవి పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దుర్గాబాయ్ దేశ్ ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణా సంస్థ (ఎస్‌డీడీజీడబ్ల్యూటీటీఐ) హైదరాబాద్‌లో మూడేళ్ల పాలిటెక్నిక్, డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహిళాశిశు సంక్షేమ జిల్లా అధికారిణి సునంద ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మే 19లోపు దరఖాస్తూ చేసుకోవాలని కోరారు. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికలు, ఇతర నిరాశ్రయులైన పిల్లలు, చిల్డ్రన్ హోం, మహిళా సంస్థల్లోని బాలబాలికలు, దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఎలక్ట్రికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్ కోర్సులు ఉన్నాయని తెలిపారు. వివరాలకు జిల్లా బాలల సంరక్షణ విభాగం గద్వాలలో సంప్రదించాలని కోరారు.

బాల పురస్కార్ అవార్డుకు..

గద్వాల: ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల శక్తి పురస్కార్ అవార్డుల కోసం అర్హులైన చిన్నారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహిళా శిశు సంక్షేమ అధికారిణి సునంద ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో ఆవిష్కరణలు, సృజనాత్మకత, సాంస్కృతిక కళలు, సాహసం, క్రీడలు,సామాజిక సేవ, శాస్త్ర సాంకేతిక, ఇతర రంగాల్లో ప్రతిభ చూపిన బాలబాలికలు జూలై 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

హాట్ సీజన్

వేసవికాలం.. చల్లని నేస్తం

సండే స్పెషల్

ఉక్కపోత నుంచి ఉపశమనానికి ప్రజల పరుగులు
- ఏసీలు, ఫ్రిజ్‌ల కొనుగోళ్లతో షాపుల్లో రద్దీ
- పండ్ల జ్యూస్‌లు, లస్సీ, ఐస్‌క్రీమ్‌లకు భలే గిరాకీ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.కోట్లలో సీజనల్ వ్యాపారం

స్టేషన్ మహబూబ్‌నగర్: రోజురోజుకూ ఎండలు ముదురుతున్నాయి. దీంతో భరించలేని ఉక్కపోతతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి. ఫ్యాన్లు ఉన్నోళ్లు కూలర్లు, కూలర్లు వాడుతున్న వారు ఏసీలు కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఇంకా వేసవి సీజన్ ప్రారంభం కావడంతో వ్యాపారులు కొత్త మోడళ్లను అందుబాటులోకి తీసుకురాగా కొనుగోలుదారులతో దుకాణాలు కిక్కిరిశాయి. ఇవే కాకుండా పళ్ల రసాలు, జ్యూస్‌లు, ఐస్‌క్రీమ్ పార్లర్లు సైతం కిటకిటలాడుతున్నాయి.

ఫ్రిజ్‌లకు గిరాకీ

వేసవిలో ఇంట్లో అడుగుపెట్టే చల్లని నేస్తం ఫ్రిజ్. కూల్‌వాటర్‌తో పాటు వేసవిలో తిండిపదార్థాలు చెడిపోకుండా ఉండడానికి ఇది చాలా అవసరం. ఈ నేపథ్యంలో పలువురు వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇన్వెర్టర్లపైనా నడిచే ఫ్రిజ్‌లు కూడా అందుబాటులోకి వచ్చాయి. రూ.12,500 నుంచి రూ.30 వేల వరకు ధరలు అందుబాటులో ఉన్నాయి. సింగిల్, డబుల్, ట్రిపుల్ డోర్ ఫ్రిజ్‌లు కొనుగోలు చేస్తుండగా.. సామాన్య, మధ్య తరగతి ప్రజలు బేసిక్ మోడళ్ల ఫ్రిజ్‌లు తీసుకుంటుండటంతో వ్యాపారం ఊపందుకుంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 100 వరకు ఫ్రిజ్‌ల షాపులు ఉండగా ఈ వేసవి సీజన్‌లో రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల వ్యాపారం జరిగే అవకాశం ఉంది.

■ ఒకప్పుడు టేబుల్ ఫ్యాన్లు, ఆ తర్వాత సీలింగ్ ఫ్యాన్ల హవా నడిచింది. ఇప్పుడు కూలర్లు, ఏసీల గాలి వీస్తోంది. ఒకప్పుడు ఉన్నత, మధ్య తరగతి ఇళ్లకే పరిమితమైన కూలర్లు ఇప్పుడు తక్కువ ధర, చిన్న సైజుల్లోనూ లభిస్తుండడంతో అందరికీ అందుబాటులోకి వచ్చేశాయి. లోకల్‌మేడ్ కాకుండా బ్రాండెడ్ కూలర్లు సైతంలో మార్కెట్లో ఉన్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేసవిలో రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల మేర వీటి వ్యాపారం నడుస్తుంది.



అమ్మకానికి సిద్ధంగా కూలర్లు



మహబూబ్‌నగర్‌లో యంత్రం నుంచి చెరుకు రసాన్ని తీస్తున్న దృశ్యం

పేదోడి ఫ్రిజ్‌కు తగ్గని ఆదరణ

పేదోడి ఫ్రిజ్‌గా పేరొందిన మట్టి కుండలు, రంజన్లకు సైతం గిరాకీ పెరిగింది. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల వీటి స్టాళ్ల ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తున్నారు. పర్యావరణ స్పృహ పెరగడంతో ప్రతి ఇంట్లోనూ ఇప్పుడు మట్టి కుండలు దర్శనమిస్తున్నాయి. వివిధ రకాల మట్టి కుండలు, రంజన్లు, మట్టి బాటిళ్లు, గ్లాసులు అందుబాటులో ఉన్నాయి.



మట్టికుండలు

పండ్లు.. జ్యూస్‌లకు డిమాండ్.

వేసవిలో కొబ్బరిబొండాలు, పుచ్చకాయలు, మామిడిపండ్లు, ఇతర జ్యూస్‌లకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది.

➪ ఆరోగ్యానికి చెరుకు రసం ఎంతో మేలైనది. ప్రత్యేకంగా వేసవిలో చెరుకురసం ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. దీనిని తీసుకోవడం వల్ల ఎండల నుంచి ఉపశమనం పొందడంతోపాటు ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు. దీంతో ప్రతిచోటా చెరుకు రసం సెంటర్లు వెలుస్తున్నాయి. మహబూబ్‌నగర్ పట్టణంలో దాదాపు 50 చెరుకు రసం కేంద్రాలు ఉన్నాయి. చెరుకు రసం ఫుల్‌గ్లాస్ రూ.30, ఆఫ్ గ్లాస్ రూ.20 ధరలు ఉన్నాయి.

➪ ఈ సీజన్‌లో ప్రతిచోట లస్సీ సెంటర్లు వెలుస్తాయి. కొన్నేళ్ల నుంచి లస్సీ (పెరుగు)కి ప్రత్యేక గుర్తింపు ఉంది. సాధారణ లస్సీ రూ.20, స్పెషల్ లస్సీని రూ.30కు విక్రయిస్తున్నారు. అదేవిధంగా ఫలుదాకు ప్రత్యేక ఆదరణ లభిస్తుంది. పాలు, డ్రైఫ్రూట్స్‌తో తయారు చేసే ఫలుదాకు ఇటీవలే కాలంలో విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. గ్లాసు ఫలుదా రూ.40 చొప్పున అమ్ముతున్నారు.



తాటిముంజలు

➪ పేద, ధనిక తేడా లేకుండా ప్రతిఒక్కరూ కొబ్బరిబొండాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రతిచోట ప్రధాన రోడ్ల వెంట వీటి అమ్మకాలు జోరుగా సాగుతాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గోదావరి జిల్లాలు, కాకినాడ, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. ఒక్కటి రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారు.

➪ మార్కెట్లో తాటిముంజలు, మామిడి పండ్ల సందడి నెలకొంది. కొల్లాపూర్ నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి మామిడిపండ్లను దిగుమతి చేసుకొని కిలో రూ.80 – 100 వరకు విక్రయిస్తున్నారు. ఇక శరీరానికి చలువ చేయడంతోపాటు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్న తాటిముంజలకు మార్కెట్లో భలే డిమాండ్ ఉంటుంది. రూ.100కు 12 ముంజలు ఇస్తున్నారు. నీటి శాతం ఎక్కువగా ఉండడంతో పాటు కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్లు, క్యాల్షియం పుష్కలంగా ఉండే పుచ్చకాయలు అన్ని ప్రాంతాల్లో లభిస్తుంది. కిలో రూ.15 నుంచి రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు.



లస్సీ తాగుతున్న ప్రజలు

హైదరాబాద్ తరహాలో తయారీ..



18 ఏళ్ల నుంచి క్లాక్‌టవర్‌లో 'హైదరాబాద్ ఫలుదా సెంటర్' నడుపుతున్నాను. హైదరాబాద్‌లో తరహాలో ఫలుదా తయారు చేస్తున్న. దీంతో ఫలుదా తాగడానికి చాలా మంది ఇష్టపడుతున్నారు. లస్సీని కూడా ప్రత్యేకంగా తయారు చేసి వినియోగదారులకు అందిస్తున్నాం. జిల్లాకేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఇక్కడికి వచ్చి ఫలుదా ఇష్టంగా ఆరగిస్తున్నారు.
– మహ్మద్ షబ్బీర్‌అలీ, ఫలుదా, లస్సీ సెంటర్, మహబూబ్‌నగర్

సొంత పొలం నుంచే..



20 ఏళ్ల నుంచి జిల్లా కేంద్రంలో చెరుకు రసం కేంద్రాన్ని నడుపుతున్నాం. మా సొంత పొలంలో పండించిన చెరుకు గడలనే వాడుతున్నాం. వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తుంది. ఆరోగ్యపరంగా లాభాలు ఉన్న చెరుకు రసాన్ని వేసవితో సంబంధం లేకుండా ఏడాది పొడువునా సెంటర్‌ను నడుపుతున్నాం.
– లక్ష్మణ్‌నాయక్, మహబూబ్‌నగర్

లస్సీ.. ఇష్టంగా తాగుతా..



లస్సీ అంటే చాలా ఇష్టం. వేసవి కాలంలో లస్సీని ఎక్కువగా తాగుతా. ఎండలో తిరిగే సమయంలో లస్సీ తాగడం శరీరానికి చల్లటి ఉపశమనం లభిస్తుంది. ధర కూడా అందరికీ అందుబాటులో ఉంటుంది.
– సాయికుమార్, మహబూబ్‌నగర్

చలో వరంగల్..

బీఆర్ఎస్ శ్రేణుల్లో రజతోత్సవ సందడి
- వరంగల్ సభకు భారీగా తరలుతున్న పార్టీ కార్యకర్తలు, అభిమానులు
- ఉమ్మడి పాలమూరు నుంచి సుమారు 50 వేల మంది తరలింపు
- బస్సులు, కార్లు ఇతర ప్రైవేట్ వాహనాలను సమకూర్చిన నేతలు
- పట్టణాలతో పాటు ఊరూరా పండుగలా పార్టీ జెండావిష్కరణలు
- ఫ్లెక్సీలు, బ్యానర్లతో గులాబీమయమైన పలు కూడళ్లు



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'గులాబీ' శ్రేణుల్లో రజతోత్సవ సందడి నెలకొంది. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్ల పూర్తికానున్న సందర్భంగా వరంగల్ జిల్లా ఎల్కతుర్తి మండలం చింతలపల్లిలో ఆదివారం నిర్వహిస్తున్న రజతోత్సవ సభను ఉమ్మడి పాలమూరుకు చెందిన ఆ పార్టీ నేతలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ మేరకు భారీ జనసమీకరణకు ఇదివరకే సన్నాహాలు మొదలుపెట్టిన నేతలు.. తాము రూపొందించుకున్న ప్రణాళికలకు అనుగుణంగా ముందుకుసాగుతున్నారు. నేడు ఊరూరా పార్టీ జెండావిష్కరణలను పండుగ వాతావారణంలో నిర్వహించి.. అనంతరం వాహనాల్లో సభకు తరలేలా తగిన ఏర్పాట్లు చేశారు. జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం సైతం పార్టీ జెండాలు ఆవిష్కరించారు. అదేవిధంగా ఫ్లెక్సీలు, పార్టీ బ్యానర్లతో మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాకేంద్రాల్లో పలు కూడళ్ల గులాబీమయంగా మారాయి.

సెగ్మెంట్‌కు 300 వాహనాలు.. 3 వేల మంది జనసమీకరణ

వరంగల్ జిల్లాలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా పార్టీ శ్రేణులను తరలింపు కోసం ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డితోపాటు ఎమ్మెల్సీ, అలంపూర్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు ఇప్పటికే సమీక్ష సమావేశాలు నిర్వహించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు నియోజకవర్గానికి 300 వాహనాల వరకు సిద్ధం చేసి.. సుమారు మూడు వేల మంది కార్యకర్తలను సభకు తరలించేలా ఏర్పాట్లు చేశారు. రజతోత్సవ సభకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని, ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 నియోజకవర్గాల నుంచి దాదాపు 50 వేల మందిని తరలించనున్నట్లు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు.

పర్యవేక్షణకు ఇన్‌చార్జీల నియామకం..

వరంగల్‌కు సుదూర ప్రయాణం చేయాల్సి ఉన్నందున ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కోసం పార్టీ నేతలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రతి వాహనానికి ఓ ఇన్‌చార్జితో పాటు భోజనం, తాగునీటి వసతుల పర్యవేక్షణకు విడివిడిగా ఇన్‌చార్జీలను నియమించారు. అదేవిధంగా సభకు వెళ్లే ప్రతి వాహనానికి సంఖ్య, ఇన్‌చార్జి పేరు, సెల్ నంబర్‌తో స్టిక్కర్ ఏర్పాటు చేయనున్నారు. ఆయా ఇన్‌చార్జీలు నియోజకవర్గ ఇన్‌చార్జితో సమన్వయం చేసుకోనున్నారు. వాహనాలు ఎక్కడి నుంచి బయలు దేరాయి.. ఎక్కడ భోజనాలు చేశారు.. ఎప్పుడు సభకు వచ్చారు.. ఎ ప్పుడు వెళ్లారు.. ఇలా సురక్షితంగా ఇంటికి చేరుకునే వరకు ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలు ప ర్యవేక్షించేలా పార్టీ నాయకత్వం ఏర్పాట్లు చేసింది.

పాలమాకుల లేదంటే శంషాబాద్ నుంచి ఓఆర్‌ఆర్‌కు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వాహనాలు పాలమాకుల దాటిన తర్వాత లేదా శంషాబాద్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్‌ఆర్)పైకి చేరుకుని.. నేరుగా ఘట్‌కేసర్ వద్ద వరంగల్ హైవేలో దిగుతాయి. ఈ క్రమంలో ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో భోజనాలు ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

జోన్–2లో పార్కింగ్..

రజతోత్సవ సభకు తరలివెళ్లే ఉమ్మడి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తమ తమ వాహనాలను జోన్–2లో పార్కింగ్ చేసుకోవాలి. వరంగల్ జాతీయ రహదారిలో కరుణాపురం వద్ద ఎన్‌హెచ్–163 బైపాస్‌లో టోల్‌గేట్ నుంచి దేవన్నపేట, మేడిపల్లి, అనంతసాగర్ మీదుగా పార్కింగ్ స్థలానికి చేరుకోవాల్సి ఉంటుంది. వాహనాలను అక్కడ పార్కింగ్ చేసి నేరుగా సభావేదిక స్థలానికి వెళ్లాల్సి ఉంటుంది.

'పాలమూరు' ప్రధానాస్త్రంగా..

వరంగల్ జిల్లా ఎల్కతుర్తి మండలంలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఏం మాట్లాడుతారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సభ తర్వాత కేసీఆర్ పాలమూరులో పర్యటించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అస్త్రంగా ఆయన పోరు బాటకు శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం. ఈ పథకానికి సంబంధించి చివరి దశలో ఉన్న పనులను పూర్తి చేయకపోవడం.. వెసులుబాటు ఉన్నా, నీటిని ఎత్తిపోయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్య నేతలు విమర్శిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ రజతోత్సవ సభలో కేసీఆర్ ఏం ప్రకటన చేస్తారనే దానిపై ఉమ్మడి జిల్లాలో జోరుగా చర్చ జరుగుతోంది.

కొత్త చట్టంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం



గట్టులో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గట్టు: భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తున్నట్లు కలెక్టర్ బీఎం సంతోష్ తెలిపారు. శనివారం గట్టులో భూ భారతి చట్టం–2025పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం కొత్తగా ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని అన్నారు. కొత్త చట్టం ప్రకారం ఇక నుంచి భూములను రిజిస్ట్రేషన్ చేయడానికి ముందు భూమిని సర్వే చేసి, మ్యాప్‌తోనే రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు, ఇలా చేయడం ద్వారా 90 శాతం భూముల వివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతి మనిషికి ఆధార్ ఉన్నట్లే.. ప్రతి రైతు భూమికి భూదార్ కార్డు ఉండనుందని, ఇక నుంచి భూ ఆక్రమణకు అవకాశం లేదన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్‌ఓఆర్ మార్పులు, చేర్పులు, వారసత్వ భూములు, సాదా బైనామాలు, ఓఆర్‌సీ వంటి సేవలు సుభతరం అవుతాయని అన్నారు. భూ సమస్యల పరిష్కారాకి మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని, నిర్దేశిత సమయంలో సమస్యలను పరిష్కరించడం జరుగుంతుందని తెలిపారు. ధరణి వ్యవస్థలో భూ హక్కులపై తలెత్తే వివాదాలకు అప్పీల్ అవకాశం లేక సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని, కొత్త చట్టం ద్వారా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్, ట్రిబ్యునల్ వరకు అప్పీల్ అవకాశం అందుబాటులోకి వచ్చి, సమస్యలకు పరిష్కారం లభించనున్నట్లు వివరించారు. జిల్లాలోనే గట్టు మండలంలోనే అత్యధిక భూ సమస్యలు ఉన్నప్పటికి ఇప్పటికే 90 శాతం సమస్యలు పరిష్కరించామని, త్వరలోనే గ్రామ పాలన అధికారుల నియామకం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామాల వారిగా అధికారులు రెవెన్యూ సదస్సులను నిర్వహించి, దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, తహసిల్దార్ సలీముద్దిన్,ఎంపీడీఓ చెన్నయ్య పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం, మెరుగైన విద్య అందించాలి

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారంతోపాటు మెరుగైన విద్యను అందించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అంగన్‌వాడీ టీచర్లకు ఆదేశించారు. శనివారం గట్టులోని సంతబజారు అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని పిల్లలు, తల్లులు, బాలింతలకు అందుతున్న అంగన్‌వాడీ సేవల గురించి సిబ్బంది ద్వారా వివరాలను తెలుసుకున్నారు. చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించి,మొబైల్ యాప్‌లోని వివరాలను చెక్ చేశారు. పిల్లల పెరుగుదల, పర్యవేక్షణ క్రమంగా చేపట్టి ఖచ్చితమైన ఎత్తులు, బరువులు యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పిల్లలను అంగ్లం అక్షరమాల, తెలుగు వర్ణమాలపై ప్రశ్నించారు. పిల్లలకు అంగన్‌వాడి కేంద్రంలో బలమైన పునాది పడడానికి మరింత మెరుగుగా అంగన్‌వాడి టీచర్లు పని చేయాలన్నారు.గర్భిణుల ఆరోగ్య స్థితిని ఎప్పడికప్పుడు పర్యవేక్షణ చేయాలని, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నయ్య, ఆస్పిరేషన్ బ్లాక్ కోఆర్డీనేటర్ అఫ్జల్, ఆర్ఐ రాజు, అంగన్‌వాడి టీచర్ వెంకట్రావమ్మలు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిం మహిళలకు మేలు



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

గద్వాలటౌన్: వక్ఫ్ సవరణ చట్టంతో పేద ముస్లిం మహిళలకు మేలు జరుగుతుందని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ పేర్కొన్నారు. వన్ నేషన్– వన్ ఎలక్షన్, వక్ఫ్ సవరణ చట్టం–2025పై జిల్లా కేంద్రంలో బీజేపీ ఏర్పాటు చేసిన మేధావుల అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో వక్ఫ్ చట్టం పక్కదారి పట్టిందని, ధనిక ముస్లింలకు మాత్రమే లబ్ధి చూకూరిందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, కమ్యూనిస్టులు, ఎంఐఎం నేతలు చట్ట సవరణపై భయాందోళనలు రేకెత్తించారని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుతో వక్ఫ్‌బోర్డుల్లో జరిగే అవినీతి, అక్రమాలకు ముగింపు పడి పేద ముస్లింలకు లాభం చూకూరుతుందన్నారు. వక్ఫ్‌బోర్డు పేరుతో ఇంతకాలం జరిగిన అక్రమాలకు ఇది అడ్డుకట్ట వేస్తుందని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వలన దేశానికి ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. అభివృద్ధికి సైతం దోహదం చేస్తుందని చెప్పారు. పలువురు ముస్లింలు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. వెనకబడిన ముస్లింలకు ఇది ఆర్థికపరమైన ఉపశమనం కలిగిస్తుందని చెప్పారు. పేద ముస్లింలు బీజేపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అప్సర్‌పాష, బీజేపీ నాయకులు రామంజనేయులు, డీకే స్నిగ్ధారెడ్డి, రామచంద్రారెడ్డి, బండల వెంకట్రాములు, రవికుమార్‌ఏక్బోటే, మాలీం ఇసాక్, మోహిద్‌ఖాన్, అత ఉర్ రహమాన్, దేవదాసు, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

రాములోరి తలంబ్రాలకు స్పందన





ఆర్ఎం నుంచి తలంబ్రాలు బుకింగ్ తీసుకుంటున్న ఏటీఎం, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ (ఫైల్)

మెరుగైన సేవలందిస్తాం..

శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాలు బుకింగ్స్‌కు మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ వ్యాప్తంగా భక్తుల నుంచి విశేషమైన స్పందన లభించింది. గతేడాది కంటే ఈసారి అధికంగా బుకింగ్స్ అయ్యాయి. ఇదేవిధంగా ఆర్టీసీ లాజిస్టిక్ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా ముందుకు సాగుతుంది.

– ఇసాక్ బిన్ మహమ్మద్, ఏటీఎం ఆర్టీసీ లాజిస్టిక్, మహబూబ్‌నగర్

- ఆర్టీసీ రీజియన్ వ్యాప్తంగా 8,888 బుకింగ్స్
- రూ.13 లక్షలకుపైగా ఆదాయం
- గతేడాది కంటే అధికంగా బుకింగ్స్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) సేవలతో ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఆర్టీసీ కార్గో సేవల పట్ల ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. గతంలో సమ్మక్క, సారక్క జాతరను పురస్కరించుకొని భక్తులకు మేడారాం ప్రసాదాన్ని ఇంటి వద్దకే అందించారు. గత నాలుగేళ్ల నుంచి శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని ఇంటి వద్దకే భద్రాద్రి రాములోరి తలంబ్రాలు అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

రీజియన్ వ్యాప్తంగా..

దేవాదాయశాఖ సహకారంతో ఆర్టీసీ లాజిస్టిక్ భద్రాచలంలో జరిగే శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాలను అందించడానికి ఏర్పాట్లు చేసింది. రూ.151 చెల్లించి ఆర్టీసీ లాజిస్టిక్ సేవా కేంద్రాల్లో బుకింగ్ చేసుకున్న వారికి ఇంటివద్దకే సీతారాముల కల్యాణ తలంబ్రాలు అందిస్తున్నారు. గతేడాది కంటే ఈసారి తలంబ్రాలు బుకింగ్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మహబూబ్‌నగర్ రీజియన్ వ్యాప్తంగా శ్రీసీతారాముల కల్యాణ తలంబ్రాల కోసం 8,888 మంది బుకింగ్ చేసుకోగా రూ.13,42,088 ఆదాయం సమకూరింది. రీజియన్‌లోని షాద్‌నగర్ డిపోలో 3,011 మంది భక్తులు అధిక సంఖ్యలో బుకింగ్స్ చేసుకున్నారు.

రీజియన్ పరిధిలో బుకింగ్ వివరాలు ఇలా..

డిపో	బుకింగ్	ఆదాయం (రూ.లలో)
మహబూబ్‌నగర్	1,314	1,98,414
గద్వాల	782	1,18,082
నారాయణపేట	243	36,693
షాద్‌నగర్	3,011	4,54,661
వనపర్తి	830	1,25,330
అచ్చంపేట- కల్వకుర్తి	1,210	1,82,710
కొల్లాపూర్	741	1,11,891
నాగర్‌కర్నూల్	704	1,06,304
ఆర్‌సీటీ	53	8,003

సైబర్ మోసాల నివారణకు.. అప్రమత్తతే ప్రధానం

- బాధితులు గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయాలి
- ఆన్‌లైన్ మనీ గేమింగ్, బెట్టింగ్‌కు పాల్పడటం చట్ట విరుద్ధం
- మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి

మహబూబ్‌నగర్ క్రైం: ప్రస్తుత ఆధునిక సమాజంలో సైబర్ నేరగాళ్లు కొత్త పంథాను ఎంచుకొని మోసాలకు పాల్పడుతున్నారని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే డయల్ 1930 లేదా ఛి ఢ్టఛిటజీఝ్ఛ.జౌఠి.జీ ు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. మోసపోయిన బాధితులు గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే త్వరగా న్యాయం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రస్తుతం వాట్సప్‌లో వీడియో కాల్ చేస్తూ డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. గుర్తింపు లేని వెబ్‌సైట్ వెతకడం, ఓపెన్ చేయడం, ఏపీకే ఫైల్స్ డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల ఫోన్ హ్యాక్ అయ్యి.. సోషల్ మీడియా నందు అశ్లీల ఫొటోలతో పోస్టులు చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడటం చేస్తున్నారన్నారు. యాప్స్‌లో యువత బెట్టింగ్ కాస్తూ కష్టార్జిత సొమ్ము కోల్పోతున్నారని.. వీటిపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బెట్టింగ్ యాప్స్‌తో బెట్టింగ్ యజమాని, నిర్వాహకుడు మాత్రమే చివరకు ధనవంతుడు అవుతారనే విషయాన్ని గ్రహించాలని యువతకు సూచించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని అత్యాశతో ఫేక్ యాప్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్ పెడితే మోసపోతామని గ్రహించాలని తెలిపారు. మహబూబ్‌నగర్ సైబర్ క్రైం విభాగం బాధితులకు త్వరగా న్యాయం చేకూర్చే విధంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. జిల్లావ్యాప్తంగా వారం రోజుల్లో 29 సైబర్ క్రైమ్స్ నమోదు కాగా.. 20 కేసులు ఆర్థిక నేరాలు, 9 కేసులు ఆర్థికేతర కేసులు నమోదయ్యాని చెప్పారు.

కొన్ని కేసులు ఇలా..

మహబూబ్‌నగర్ రూరల్ పీఎస్ పరిధిలో ఓ వ్యక్తికి అజ్ఞాత వ్యక్తి కాల్‌చేసి.. తాను ఇండియా బుల్స్ లోన్ ఎగ్జిక్యూటివ్‌గా చెబుకున్నాడు. రుణ ఆమోదానికి ఫీజు పేరుతో బాధితుడి వద్ద రూ. 1,60,654 వసూలు చేశాడు. మరిన్ని డిమాండ్లు రావడంతో బాధితుడు 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశాడని ఎస్పీ తెలిపారు.

■ మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పీఎస్ పరిధిలో బాధితురాలు ఫేస్‌బుక్ స్క్రోల్ చేసిన వెంటనే వాట్సప్ ద్వారా దొంగలు సంప్రదించి.. మొదట కొన్ని లాభాలు చూపించారు. ఆ తర్వాత ఎక్కువ పెట్టుబడికి ఒత్తిడి చేశారని, చివరికి రూ. 47వేలు మోసపోయినట్లు గ్రహించి 1930 నంబర్‌కు ఫిర్యాదు చేశారని ఎస్పీ వెల్లడించారు.

■ బాలానగర్‌లో బాధితుడికి వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా గూగుల్ సమీక్షల పనులు ఇచ్చి.. ప్రీపెయిడ్ పెట్టుబడి కోరారు. అతడు రూ. 1,72,986 పంపించిన తర్వాత మోసపోయినట్లు గుర్తించారు.

■ మహబూబ్‌నగర్ టూటౌన్ పీఎస్ పరిధిలో ఇండియా హిల్ హౌస్ కాంపిటీషన్ పేరుతో పెట్టుబడి మోసం చేశారు. ఇందుకు వికాసా క్యాపిటల్ పేరు ఉపయోగించి ఫేక్ డీమ్యాట్ ఖాతా, ఫేక్ ట్రేడింగ్ యాప్ ద్వారా రూ. 15.5 లక్షలు మోసం చేశారని.. తర్వాత మరో రూ. 42లక్షలు అడగడంతో అనుమానం వచ్చి సైబర్ క్రైంకి ఫిర్యాదు చేశారు.



అంతర్రాష్ట్ర దొంగల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- 25.09 తులాల బంగారం రికవరీ

జిడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఆరు నెలల నుంచి ముప్పతిప్పలు పెడుతున్న మహారాష్ట్రకు చెందిన అంతర్రాష్ట్ర గజదొంగ ఆమోల్ రాందాస్ పవార్ (38)ను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అతడి నుంచి 25 తులాల 9 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ డి.జానకి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లుతో కలిసి శనివారం ఎస్పీ వెల్లడించారు. మహారాష్ట్రంలోని సోలాపూర్ జిల్లా మహోల్ తాలూకా ఎల్లంవాడికి చెందిన ఆమోల్ రాందాస్ పవార్ చిన్నప్పటి నుంచి జల్సాలకు అలవాటు పడి.. దొంగతనాలు చేయడంతో పాటు రైల్వే డకాయిటి, దారి దోపిడీలు, హెబ్బీ నైట్స్ లాంటి అనేక నేరాలకు పాల్పడే వాడు. అతడి ప్రధాన దొంగతనం మాత్రం బంగారమే లక్ష్యంగా ఉంటుంది. వివిధ రాష్ట్రాల్లో 50 నుంచి 100 వరకు వివిధ రకాల కేసులు ఉన్నాయి. కొన్ని చోట్ల వారెంట్లు కూడా ఉన్నట్లు సమాచారం. ఆయా రాష్ట్రాల్లో జైలు నుంచి విడుదలయ్యాక.. ఇతర రాష్ట్రాల్లో దొంగతనాలు చేయడానికి ఒక కారును కొనుగోలు చేశాడు. ఆ తర్వాత తన కులస్తులైన సచిన్, ఆకాశ్ భట్, ఆకాశ్‌లతో కలిసి చోరీలకు పాల్పడ్డాడు. మహబూబ్‌నగర్‌లో 6 నెలల వ్యవధిలో 13 ఇళ్లల్లో చోరీలకు పాల్పడి దాదాపు 25 తులాల 9 గ్రాముల బంగారం అపహరించారు. ఆమోల్ రాందాస్ పవార్ శనివారం తన స్నేహితులతో కలిసి మహబూబ్‌నగర్, జడ్చర్ల ప్రాంతాల్లో దొంగిలించిన బంగారాన్ని అమ్మడానికి వచ్చిన క్రమంలో మహబూబ్‌నగర్, జడ్చర్ల రూరల్ పోలీసులకు పట్టుబడ్డాడని.. మిగతా నేరస్తులు పరారీలో ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. అతడి నుంచి దొంగతనానికి వినియోగించిన కట్టర్, ఐరన్ రాడ్, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర దొంగను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులకు ఎస్పీ రివార్డు అందజేశారు. సమావేశంలో మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీనాయక్, జడ్చర్ల సీఐ నాగార్జునగౌడ్ ఉన్నారు.

క్లుప్తంగా

మోడిఫైడ్ సైలెన్సర్లుంటే చర్యలు



వనపర్తి: నెల రోజులుగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బుల్లెట్లు, ఇతర ద్విచక్ర వాహనాలకు బిగించిన 66 అధిక శబ్దం చేసే మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించి ఒక్కో వాహనానికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు వనపర్తి సీఐ కృష్ణయ్య శనివారం తెలిపారు. ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశానుసారం ట్రాఫిక్ ఎస్ఐల ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని తొలగించిన సైలెన్సర్లను పాలిటెక్నిక్ కళాశాల ఎదుట రోడ్ రోలర్‌తో తొక్కించారు. ఈ చర్యలతో ట్రాఫిక్ నియంత్రణ బలోపేతం అవుతుందని, రహదారుల భద్రత పెరుగుతుందని, ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందన్నారు. కార్యక్రమంలో వనపర్తి పట్టణ ఎస్ఐ హరిప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ సురేందర్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

శాంతినగర్: కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన వడ్డేపల్లి మండలంలోని వెంకట్రామనగర్ శివారులో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కుర్వ కిష్టన్న గొర్రెల మందను మేపడానికి వెళ్తున్న సమయంలో వాటి పిల్లలను ఇనుప కంచెలో భద్రంగా ఉంచి వెళ్లిపోయాడు. మందను మేపేందుకు వెళ్లి తిరిగి వచ్చేవరకు 30 గొర్రె పిల్లలు చనిపోయి ఉన్నాయి. పరిసరాలను పరిశీలించగా కుక్కలు కొరికి చంపినట్లు నిర్ధారించుకుని కన్నీటి పర్యంతమయ్యాడు. బాధితునికి పరిహారం అందించి ఆదుకోవాలని తోటి గొర్రెల కాపరులు కోరుతున్నారు.

వ్యవసాయ పొలంలో మృతదేహం కలకలం

అలంపూర్: మున్సిపాలిటీ సమీపంలో ఒక వ్యవసాయ పొలంలో వ్యక్తి మృతదేహం కలకలం సృష్టించింది. పొలంలో నిర్జీవంగా ఒక వ్యక్తి పడి ఉండటంతో ఎవరైనా హత్య చేశారేమోనని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. అలంపూర్ మండలం ఇమాంపురం శివారులో శనివారం ఉదయం ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. స్థానిక ఎస్ఐ వెంకటస్వామి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించగా అక్కడ దొరికిన ఆధారాలను బట్టి మృతి చెందిన వ్యక్తి మహబూబ్‌నగర్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన కల్వాల రఘుపతి(55)గా గుర్తించారు. వెంటనే వివరాలు సేకరించి ఆధారాలతో కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చామని, మృతదేహం వద్ద బస్సు టికెట్లు లభించినట్లు పోలీసులు తెలిపారు. కాగా.. రఘుపతి ఈ నెల 24వ తేదీన మహబూబ్‌నగర్ నుంచి జడ్చర్లకు వచ్చి.. అక్కడి నుంచి బస్సులో అలంపూర్ చౌరస్తాకు చేరుకున్నాడు. అక్కడి నుంచి ఆటోలో అలంపూర్ ఆలయాలకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఇది ఇలా ఉండగా మృతుడి కుటుంబసభ్యులు అప్పటికే మహబూబ్‌నగర్ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రఘుపతి కనబడటం లేదని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మృతుడు కొంతకాలంగా తనలో తానే బాధపడుతూ ఉండేవాడని కుటుంబసభ్యుల ద్వారా తెలిసిందన్నారు. అలంపూర్‌కు వచ్చి పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందన్నారు. మృతుడి అన్న గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య సంధ్యారాణి, కుమారుడు ఉన్నట్లు తెలిపారు.

మళ్లీ రెస్క్యూ ఆపరేషన్



ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు చేపడుతున్న రెస్క్యూ సిబ్బంది

సాంకేతిక కమిటీ సూచనల మేరకు సొరంగంలోకి వెళ్లిన సిబ్బంది

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం లోపల శనివారం సహాయక చర్యలు కొనసాగాయి. నిపుణుల సూచన మేరకు నిషేధిత ప్రాంతాన్ని పది మీటర్ల మేర పొడిగించి మళ్లీ రెస్క్యూ ఆపరేషన్ చేపడుతున్నారు. శిథిలాల తొలగింపు పనులు దాదాపు పూర్తికావడంతో ఎన్‌డీఆర్ఎఫ్, ఆర్మీ, ర్యాట్ హోల్ మైనర్స్‌కు చెందిన సహాయక సిబ్బంది వెళ్లిపోయారు. ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ, హైడ్రా, దక్షిణమధ్య రైల్వేకు చెందిన సుమారు 180 మంది సిబ్బంది ఎస్ఎల్‌బీసీ వద్ద సాంకేతిక కమిటీ సూచనల మేరకు పనిచేస్తున్నారు. ప్రభుత్వం నియమించిన టెక్నికల్ సబ్ కమిటీ సొరంగంను సందర్శించి, అధ్యయనం చేసి సూచనలు చేసే అవకాశం ఉంది. సబ్ కమిటీకి సహాయక సిబ్బంది సొరంగం పరిస్థితులను వివరించేందుకు కొన్ని బృందాలను ఇక్కడ ఉంచినట్లు తెలిసింది. సహాయక చర్యలు దాదాపుగా ముగియడంతో సొరంగం లోపల నుంచి ఎస్కవేటర్లు, గ్యాస్ కట్టర్లు, సిలిండర్లు, ఇతర సామగ్రిని బయటకు తెచ్చారు. సొరంగం ముందుకు ఆయా సహాయక బృందాలు ఏర్పాటు చేసిన టెంట్లను సైతం తొలగించారు.

43 మీటర్ల పరిధిలోనే..

డీ–1 నిషేధిత ప్రదేశంలోని టీబీఎం క్యాబిన్‌లో ఆరుగురి కార్మికులు ఉండవచ్చని సహాయక సిబ్బంది అనుమానిస్తున్నారు. ఈ ప్రాంతంలో తవ్వకాల సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని ప్రభుత్వం టెక్నికల్ సబ్ కమిటీని నియమించింది. ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ ఇచ్చే నివేదికకు మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ఎస్ఎల్‌బీసీ తవ్వకాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. సొరంగంలో చిక్కుకున్న కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కులు అందిస్తామని తెలిపారు.

టన్నుల కొద్దీ శిథిలాలు..

సొరంగం పైకప్పు కూలిన ఘటనలో 120 మీటర్ల పొడవైన టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) నీటి ప్రభావం, శిథిలాల ధాటికి కాంక్రీట్ సెగ్మెంట్లు కూలి టీబీఎం రెండు భాగాలుగా విడిపోయింది. టీబీఎం ప్లాట్‌ఫాం, సెగ్మెంట్ బ్లాక్స్ లిఫ్టింగ్ క్రేన్ ప్లాట్‌ఫాం, డీవాటరింగ్ పైపులు, కన్వేయర్ బెల్టు, ఆక్సిజన్ వెంటిలేషన్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, లోకో ట్రైన్, కంప్రెషర్ వంటి వ్యవస్థలకు చెందిన విభాగాలు తెబ్బతిన్నాయి. సుమారు కిలోమీటర వరకు మట్టి, బురద, రాళ్లు, నీరు చేరి లోకో ట్రైన్ ట్రాక్ సైతం శిథిలాల కింద కూరుకుపోయింది. దీంతో సహాయక సిబ్బంది టన్నుల కొద్దీ వెలువడిన మట్టి, బురద, రాళ్లను తొలగిస్తూ దక్షిణమధ్య రైల్వే సిబ్బంది ప్లాస్మా థర్మల్ కట్టర్‌తో టీబీఎం భాగాలు కట్ చేసి బయటకు తీశారు. లోకో ట్రైన్ ట్రాక్, కన్వేయర్ బెల్టు, వెంటిలేషన్ వ్యవస్థలను పునరుద్ధరించి టన్నుల కొద్ది వెలువడిన శిథిలాలను బయటకు తరలించారు.

బోటి కర్రీలో ఎలుక

హోటళ్లను తనిఖీ చేసిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్

అచ్చంపేట రూరల్: అచ్చంపేట పట్టణంలోని ఓ హోటల్‌లో వినియోగదారుడు తీసుకున్న బోటీ కర్రీలో ఎలుక వచ్చిన ఘటన వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని పరివార్ హోటల్‌లో శుక్రవారం సాయంత్రం ఓ వినియోగదారుడు బోటీ కర్రీని పార్సిల్ తీసుకుని వెళ్లాడు. ఇంటికి వెళ్లి పార్సిల్‌ను విప్పి చూడగా.. అందులో ఎలుక కనిపించింది. దీంతో ఆ పార్సిల్‌ను తీసుకుని వెళ్లి హోటల్ నిర్వాహకుడిని నిలదీయడంతో పాటు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం సదరు హోటల్‌లో ఉన్న మాంసాన్ని, పరిసరాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పరిశీలించారు. వినియోగదారుడు, హోటల్ యజమానితో వివరణ తీసుకున్నారు. పార్సిల్‌లోని బోటి కర్రీ, హోటల్‌లోని మాంసం పదార్థాల శాంపిళ్లను తీసుకుని ల్యాబ్‌కు పంపించనున్నట్లు ఆయన తెలిపారు. ఆహార పదార్థాల్లో కల్తీ జరిగినట్లు తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదే విధంగా పట్టణంలోని హోటల్ తాజ్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను పరిశీలించారు.



హోటల్‌లో మాంసాన్ని పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్

ఎస్ఐని మాట్లాడుతున్నా.. డబ్బులు పంపు!

దుకాణదారులు, వ్యాపారులకు సైబర్ నేరస్తుడి ఫోన్ కాల్

దేవరకద్ర రూరల్/అడ్డాకుల: 'నేను ఎస్ఐని మాట్లాడుతున్నా.. పై అధికారులకు డబ్బు అవసరం ఉంది.. అర్జెంట్‌గా ఫోన్ పే ద్వారా డబ్బు పంపించు' అని సైబర్ నేరగాళ్లు దుకాణదారులు, వ్యాపారులను బురిడీ కొట్టించిన ఘటన శనివారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. తాను దేవరకద్ర ఎస్ఐ శ్రీనివాస్‌ను మాట్లాడుతున్నానంటూ ఓ వ్యక్తి రెండు రోజులుగా 99598 33716 నంబర్ నుంచి వివిధ గ్రామాలకు చెందిన వ్యాపారులు, దుకాణదారులు, నాయకులకు ఫోన్ చేసి డబ్బులు కాజేందుకు ప్రయత్నించాడు. కొందరు అతడి మాటలు నమ్మి ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించినట్లు సమాచారం. మరికొందరికి అనుమానం వచ్చి విషయాన్ని స్థానిక ఎస్ఐ నాగన్నకు సమాచారం అందించడంతో.. ఆయన సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు. పోలీసులు ఎవరినీ డబ్బులు అడగరానే విషయాన్ని ప్రజలు గమనించాలని స్పష్టంచేశారు. అపరిచితుల వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

■ మూసాపేట మండలం జానంపేట శివారులో 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న పెట్రోల్ పంపు యాజమాని శివప్రసాద్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి.. తాను అడ్డాకుల ఎస్ఐ మాట్లాడుతున్నానని చెప్పి బంక్ మేనేజర్ ఫోన్ నంబర్ తీసుకున్నాడు. ఆ తర్వాత మేనేజర్ రాజేశ్‌కు కాల్‌చేసి.. తాను ఎస్ఐని మాట్లాడుతున్నానని చెప్పారు. అర్జంట్‌గా రూ. 20వేలు ఫోన్ పే చేయాలని.. తాను క్యాష్ పంపిస్తానని అడిగాడు. ఈలోగా తాను కాల్‌లోనే ఉంటానని చెప్పి డబ్బులు వేయమన్నాడు. అనుమానం వచ్చిన మేనేజర్.. తాను మళ్లీ ఫోన్ చేస్తానని చెప్పి కాల్ కట్ చేశారు. వెంటనే మూసాపేట పోలీసులకు సమాచారం ఇచ్చి.. వారి ద్వారా అడ్డాకుల ఎస్ఐతో మాట్లాడి ఇది సైబర్ నేరగాళ్ల పనేనని నిర్ధారించుకున్నారు. కొంతసేపటికి సైబర్ నేరగాడు మళ్లీ ఫోన్‌చేసి.. డబ్బులు పంపించమని అడగాడు. అయితే ముందుగా మీరు రూ. 20వేల క్యాష్ పంపిస్తే.. తాను అకౌంట్లోకి డబ్బులు వేస్తానని చెప్పడంతో అవతలి వ్యక్తి కాల్ కట్ చేశాడని మేనేజర్ రాజేశ్ తెలిపారు. దీనిపై అడ్డాకుల ఎస్ఐ ఎం.శ్రీనివాస్‌ను సంప్రదించగా.. తమ పేరుతో వచ్చే ఇలాంటి ఫోన్ కాల్స్‌ను ఎవరు నమ్మవద్దని కోరారు. మూసాపేట ఎస్ఐ ఎం.వేణు మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్స్‌కు ఎవరూ రెస్పాండ్ కావద్దని చెప్పారు. అనుమానం వస్తే వెంటనే 1930కి లేదా పోలీస్ స్టేషన్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

దేవరకద్రలో కర్ణాటక దొంగల హల్‌చల్

దేవరకద్ర రూరల్: కర్ణాటక ప్రాంతానికి చెందిన దొంగలను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీసీఎస్ పోలీసులు సినీఫక్కీలో పట్టుకున్న సంఘటన శనివారం దేవరకద్రలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాజంపేటలో కొన్ని రోజుల క్రితం ఒక నగల దుకాణంలో దొంగతనం జరిగింది. ఈ దొంగతనం చేసిన వారిని గుర్తించేందుకు అక్కడి సీసీఐ పోలీసులు రంగంలోకి దిగారు. దర్యాప్తు చేస్తున్న క్రమంలో నిందితులు వాడుతున్న ఫోన్ సిగ్నల్స్ దేవరకద్ర పరిసర ప్రాంతాలను చూపించాయి. ఇదే క్రమంలో ముగ్గురు నిందితులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఒక హోటల్ దగ్గర భోజనం కోసం ఆగారు. అక్కడే ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టి ఆన్ చేశారు. దీంతో వారిని వెతుకుతున్న పోలీసులకు లోకేషన్ అందడంతో నేరుగా హోటల్ దగ్గరకు చేరుకున్నారు. పోలీసులను చూసిన నిందితులు పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వెంటపడిన పోలీసులపై నిందితులు రాళ్లు రువ్వారు. స్థానికుల సహాయంతో ఇద్దరిని పట్టుకోగా, మరో నిందితుడు ద్విచక్ర వాహనంపై దేవరకద్ర పెద్ద చెరువు కట్ట వైపుగా వెళ్లి తప్పించుకున్నాడు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో వారు అక్కడికి చేరుకొని వారి వివరాలు పరిశీలించారు. పై అధికారికి సమాచారం ఇచ్చి పోలీసులను పంపించారు. ఈ సంఘటన మొత్తం బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి కొండ ప్రశాంత్‌రెడ్డి గెస్ట్‌హౌజ్ చుట్టు జరగడంతో కొద్దిసేపు అక్కడ ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

బ్యాంక్ అకౌంట్ నుంచి నగదు చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: బ్యాంక్ అకౌంట్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి నగదు చోరీ చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన వరాల భాస్కర్ ఈ నెల 22న నాగర్‌కర్నూల్‌కు వస్తుండగా ఫోన్ కిందపడటంతో గుర్తు తెలియని వ్యక్తి తీసుకెళ్లాడు. సదరు వ్యక్తి ఫోన్ ద్వారా భాస్కర్ బ్యాంకు అకౌంట్ నుంచి విడతల వారీగా రూ. 1.66 లక్షల నగదు చోరీ చేశాడు. శనివారం బ్యాంకు అకౌంట్ స్టేట్‌మెంట్ తీసుకునేందుకు భాస్కర్ వెళ్లగా.. నగదు డ్రా అయినట్లు గుర్తించాడు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

వీడిన హత్య మిస్టరీ

- ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య
- నలుగురు నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ మొగిలయ్య



వివరాలు వెల్లడిస్తున్న గద్వాల డీఎస్పీ మొగిలయ్య

గద్వాల క్రైం: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తను ప్రియుడు, మరో ముగ్గురితో కలిసి భార్య హతమార్చిందని.. నలుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ మొగిలయ్య తెలిపారు. శనివారం జిల్లాకేంద్రంలోని సీఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. మల్దకల్ మండలం మద్దెలబండకు చెందిన కుర్వ నర్సింహులు (30)కు కేటీదొడ్డి మండలం గంగన్‌పల్లికి చెందిన పద్మ (శ్రీదేవి)తో 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు కూడా ఉన్నారు. భార్యాభర్తల గొడవల కారణంగా పద్మ కొంతకాలంగా పుట్టింటిలోనే ఉంటోంది. ఈ క్రమంలో నర్సింహులు అప్పుడప్పుడు భార్యను చూసేందుకు గంగన్‌పల్లికి వచ్చి వెళ్లేవాడు. అయితే పద్మ తన మామ వరుసైన కుర్వ అంజలప్పతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండగా.. ఆ విషయం భర్తకు తెలిసింది. అతడిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని భార్య, ప్రియుడు వ్యూహం రచించారు. గట్టు మండలం బస్వాపూర్‌కు చెందిన గుంత గోవిందుతో రూ.1.50 లక్షలకు ఒప్పందం చేసుకొని కుర్వ నర్సింహులు హత్యకు పూనుకున్నారు. 17వ తేదీ రాత్రి మద్యం కొనుగోలు చేసి బైక్‌పై గుంత అంజలప్ప, నర్సింహులు, గోవిందు కలిసి హనుమప్ప గుట్టుకు వెళ్లారు. అక్కడే ముగ్గురు మద్యం తాగగా నర్సింహులుకు అధిక మోతాదులో మద్యం తాగించారు. అనంతరం అక్కడికి గుంత ఆంజనేయులు చేరుకొని అందరూ కలిసి గుంత నర్సింహులును హత్య చేశారు. అనంతరం ఇంకుడుగుంతలో మృతదేహాన్ని పూడ్చి అక్కడి నుంచి తప్పించుకున్నారు.

ఇలా వెలుగులోకి..

ఈ నెల 19న కేటీదొడ్డి శివారులో ఉపాధి కూలీలు ఇంకుడు గుంతలు తవ్వుతుండగా దుర్వాసన రావడంతో పరిశీలించగా మృతదేహం బయటపడింది. దీంతో పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలానికి చేరుకొని కుర్వ నర్సింహులుగా గుర్తించారు. ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. సీఐ శ్రీను, ఎస్ఐ శ్రీనివాసులు పద్మ (శ్రీదేవి)ని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నట్లు చెప్పారు. శనివారం నిందితులను మైలగడ్డ స్టేజీ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. హత్యకు వినియోగించిన కత్తి, బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్ట్ చేసి గద్వాల కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. కేసు ఛేదనలో సాంకేతిక విభాగ సిబ్బంది రంజిత్‌కుమార్, రజినీబాబు, మహబూబ్‌పాషా, రమేష్ కీలకంగా వ్యవహరించారని.. సిబ్బందికి క్యాష్ రివార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీను, ఎస్ఐ శ్రీనివాసులు ఉన్నారు.

ఆనంద్‌శర్మ సస్పెన్షన్ నిలిపివేత

సాక్షి, హైదరాబాద్: జోగుళాంబ గద్వాల జిల్లా శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం ఆలయ పూజారి డి.ఆనంద్‌శర్మ సస్పెన్షన్‌ను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ జూన్ 26కు వాయిదా వేస్తూ, ఆ లోగా కౌంటర్ సమర్పించాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించింది. ఎలాంటి కారణాలు పేర్కొనకుండా ఈ నెల 24న ఉన్నతాధికారులు జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆనంద్‌శర్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే ఒత్తిడి కారణంగానే ఎలాంటి కారణం చూపకుండా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది చంద్రశేఖర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఆనంద్‌పై వచ్చిన ఆరోపణలన్నీ అసత్యాలని, ఎలాంటి సాక్ష్యం లేకుండా సస్పెన్షన్ విధించడం చట్టవిరుద్ధమన్నారు. ఎమ్మెల్యే అనుమతి లేకుండా ఆనంద్ అతని ఫొటో తీశారని ప్రభుత్వ న్యాయవాది సతీశ్ కుమార్ చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశిస్తూ.. విచారణ వేసవి సెలవుల తర్వాతకు వాయిదా వేశారు.

చిన్నారి మృతిపై విచారణ

అమరచింత: పట్టణానికి చెందిన చిన్నారి ఆర్తిక (18నెలల) మృతిపై సీఐ శివకుమార్ ఆధ్వర్యంలో శనివారం విచారణ చేపట్టారు. పట్టణానికి చెందిన తెలుగు వంశీ కూతురు మూడు రోజుల క్రితం గుర్తుతెలియని ద్రావణం తాగి అపస్మారక స్థితికి చేరుకుని మృతి చెందిన విషయం తెలిసిందే. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టానికి చిన్నారి మృత దేహాన్ని తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మృతికి గల కారణాలు పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత తెలుస్తాయన్నారు. ప్రాథమికంగా చిన్నారి ఇంటి పరిసరాలతో పాటు చుట్టుపక్కల ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారిని విచారించినట్లు తెలిపారు. విచారణలో ఎస్ఐ సురేష్, సిబ్బంది ఉన్నారు.

• విజయ పథం





• సోలార్ పవర్‌తో జీవితాల్లో కొత్త వెలుగు

సోలార్ సఖి

రైల్లో తొలిసారి ప్రయాణించిన ఆ మహిళలు.... 'రైలు ప్రయాణం ఇంత బాగుంటుందా!' అని సంబరపడి పోయారు. ఆ తరువాత మరో ప్రయాణం మొదలు పెట్టారు. అయితే అది రైలు ప్రయాణం కాదు. తమ జీవితాలను మార్చివేసిన ప్రయాణం. చిన్న చదువులు చదువుకున్న ఎంతో మంది గ్రామీణ మహిళలు సోలార్ ఇంజినీర్‌లుగా, ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా రాణిస్తున్నారు...



• సోలార్ సఖి: భవిష్యత్ తరానికి మార్గదర్శనం

రాజస్థాన్‌లో నిశ్చలగఢ్‌కు చెందిన తవ్రీదేవి ఎన్నో సంవత్సరాలు విద్యుత్ సౌకర్యం లేని ఇంట్లోనే గడిపింది. అయిదవ తరగతి తరువాత తల్లిదండ్రులు చదువు మాన్పించడంతో ఇంటి పనులు చేసేది. గొర్రెలు మేపేది. ఇల్లే ప్రపంచంగా బతుకుతున్న తవ్రీదేవి జీవితాన్ని 'సోలార్ పవర్' మార్చివేసింది. హర్మదా(జైపూర్)లో ఐదు నెలల సోలార్ ఇంజినీరింగ్ శిక్షణ కార్యక్రమం ఆమె జీవితాన్ని కొత్త దారిలోకి తీసుకువెళ్లింది.

సోలార్ ఇంజినీరింగ్ శిక్షణ కోసం సిద్ధం అయినప్పుడు..

'ఎందుకులే' అన్నారు తల్లిదండ్రులు. వారిని బలవంతంగా ఒప్పించాల్సి వచ్చింది,

'మా కమ్యూనిటీలోని మహిళలు ఎప్పుడూ ముసుగు లేకుండా ఒంటరిగా బయటకు వెళ్లలేదు. నేను ఎప్పుడూ పట్టణ ప్రాంతానికి ఒంటరిగా వెళ్లలేదు' అంటుంది తవ్రీదేవి.

కిషన్‌గడ్‌కు వెళ్లడం...తన తొలి రైలు ప్రయాణం! 'అది పూర్తిగా కొత్త అనుభవం. ప్రయాణంలోని ఆనందం తెలిసొచ్చింది' అంటుంది తవ్రీదేవి.



• 'ఆది సేవా గౌరవ్ సమ్మాన్' అవార్డ్ అందుకున్న తవ్రీదేవి

శిక్షణలో సోలార్ ఇన్‌స్టలేషన్, ఫీల్డ్‌వర్క్‌కు అవసరమైన నైపుణ్యాలు సంపాదించింది. ఆ తరువాత స్వగ్రామానికి తిరిగివచ్చింది. 'మేము చాలా సంవత్సరాలు చీకటిలో జీవించాము. అందుకే మా జీవితాల్లో వెలుగు తీసుకురావాలనుకున్నాను' అంటుంది తవ్రీదేవి.

సోలార్ ఇంజినీర్‌గా కొత్త జీవితాన్ని ప్రారంభించిన తవ్రీదేవి తన గ్రామానికి విద్యుత్ వెలుగులు తీసుకువచ్చింది. భారత రాష్ట్రపతి నుండి 'ఆది సేవా గౌరవ్ సమ్మాన్' అవార్డ్ అందుకుంది. ఇది కేవలం తవ్రీదేవి విజయగాథ మాత్రమే కాదు... జార్ఖండ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, మిజోరాం, నాగాలాండ్‌తో సహా పదిరాష్ట్రాలలో మూడువేల మందికి పైగా గ్రామీణ మహిళా సోలార్ ఇంజినీర్‌ల విజయగాథ.

తమ గ్రామాల్లో సోలార్ ప్యానెళ్లను ఒంటి చేత్తో మరమ్మతు చేసే వీరు పారిశ్రామికవేత్తలుగా కూడా ఎదిగారు. ఈ మార్పుకు కారణం హర్ష్ తివారీ నేతృత్వంలోని ఈఎంపీఐ ఇంటర్నేషనల్. ఈ సంస్థ శిక్షణ కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలు సోల్డరింగ్, వైరింగ్, బ్యాటరీ సెటప్, ఫాల్ట్ ఫైండింగ్, ఇన్‌స్టలేషన్‌లలో ప్రావీణ్యం సాధించారు. గ్రామీణ మహిళలకు సాంకేతిక నైపుణ్యం, ఆర్థికస్వాతంత్ర్యం లక్ష్యంగా ఈఎంపీఐ ఇంటర్నేషనల్ పనిచేస్తోంది.

శిక్షణ అనంతరం మహిళలు తమ గ్రామాల్లో సోలార్ సొల్యూషన్స్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు. మరమ్మతులు, ఫస్ట్‌లెవల్ చెకప్‌లు నిర్వహించేందుకు వీలుగా చిన్న ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తారు. గ్రామస్థాయి ఇంధన మౌలిక సదుపాయాలు సజావుగా సాగేలా చూస్తారు. శిక్షణ పూర్తయిన తరువాత క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న మహిళా సోలార్ ఇంజినీర్‌లను 'సోలార్ సఖీ' అని పిలుస్తారు.

'వ్యవసాయంతో పాటు చిన్న తరహా పరిశ్రమలలో సౌరశక్తితో నడిచే పరికరాలకు డిమాండ్ పెరుగుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈఎంపీఐ ఇంటర్నేషనల్ సోలార్ సఖీలకు శిక్షణ ఇస్తోంది. జీవనోపాధి కల్పిస్తుంది. టెక్నికల్ ట్రైనింగ్‌తోపాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, కస్టమర్ ఎంగేజ్‌మెంట్‌లో కూడా శిక్షణ ఇస్తాం. గ్రామాల్లో సోలార్ సెటప్‌లలో ఏవైనా సాంకేతిక లోపాలు తలెత్తితే సోలార్ సఖులు పరిష్కారం చూపుతున్నారు' అంటున్నాడు హర్ష్ తివారీ.

కూల్ సమ్మర్

పక్షులను చల్లగా కాపాడుకుందాం!

వేసవి కాలం పక్షులకు కష్టకాలం. అధిక వేడి పక్షులకు ప్రమాదకరంగా మారుతుంది. డీహైడ్రేషన్, వడదెబ్బ బారిన పడకుండా పక్షులను రక్షించడానికి... నీరు, నీడ, గాలి ప్రసరణకు ప్రాముఖ్యత ఇవ్వాలి. కొన్ని జాగ్రత్తలు...





• పక్షులకు అన్ని వేళలా శుభ్రమైన మంచినీరు అందుబాటులో పెట్టాలి • వేర్వేరు ప్రదేశాలలో వాటర్ బౌల్స్ పెట్టాలి • చల్లగా, ఫ్రెష్‌గా ఉండడానికి వాటర్ బౌల్స్‌లో ఐస్ క్యూబ్స్ వేయవచ్చు • చల్లని, సౌకర్యవంతమైన స్థలంలో పక్షులు ఉండేలా చూడాలి • కూలింగ్ మ్యాట్స్ ఉపయోగించవచ్చు • పక్షులపై ఒక నిమిషం లేదా అర నిమిషం నీటిని స్ప్రే చేయాలి • పక్షులకు సమీపంలో తడి టవల్స్ ఏర్పాటు చేయాలి •వేగంగా శ్వాస తీసుకోవడం, ఉక్కిరిబిక్కిరి కావడం, బద్ధకంగా కనిపించడం, తినడానికి ఆసక్తి చూపించకపోవడం...మొదలైనవి పక్షులకు సంబంధించి ఓవర్ హీటింగ్ లక్షణాలు. ఈ లక్షణాలు కనిపించిన వెంటనే తక్షణ జాగ్రత్తలు తీసుకోవాలి • ఆహారం విషయానికి వస్తే.... నీటి శాతం ఎక్కువగా ఉన్న పుచ్చకాయ, దోసకాయలాంటివి అందించవచ్చు • ఉత్తర్‌ప్రదేశ్‌లోని కొన్ని జిల్లాలలో వందలాది గ్రామాల్లో యానిమల్ యాక్టివిస్టులు వేసవి వేడి నుంచి పక్షులను కాపాడడానికి 'బర్డ్ రెస్టారెంట్స్' ఏర్పాటు చేశారు. పక్షులకు చల్లని నీడను ఇచ్చేలా నీరు, ఆహార పదార్థాలతో చెట్టు కొమ్మలపై ఈ రెస్టారెంట్‌లు ఏర్పాటు చేశారు.





• మానవత్వం

నిరీక్షణ ఫలించింది...



కొన్ని సంవత్సరాల నుంచి భర్తతో కలిసి మన దేశంలో ఉంటున్న క్రిస్టెన్ ఫిషర్ అనే అమెరికన్ భారత్‌లో తన అనుభవాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేస్తుంటుంది. ఢిల్లీలో ఉంటున్న ఫిషర్ దంపతులు నిషా అనే దివ్యాంగురాలైన బాలికను దత్తత తీసుకోవాలనుకున్నారు. అయితే దత్తత ప్రక్రియ సుదీర్ఘంగా కొనసాగింది.

'2023లో అక్టోబర్‌లో దత్తత కోసం దరఖాస్తు చేసుకోగా, 2024లో నిషాకు దగ్గరయ్యాం. 2025 ఏప్రిల్ నాటికి దత్తత పూర్తయింది. ఇప్పుడు నిషా మా అందమైన కుమార్తె' అని ఇన్‌స్టాగ్రామ్‌లో రాసింది ఫిషర్.

'కౌంటింగ్ డౌన్ ది డేస్ అన్‌టిల్...' ట్యాగ్‌లైన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేసింది. ఈ వీడియోలో తాను దత్తత తీసుకున్న పాప కనిపిస్తుంది.

మరో వీడియోలో చిన్నారి నిషాకు సంబంధించిన ఎమోషనల్ గ్లింప్స్‌ను షేర్ చేసింది. దివ్యాంగురాలు అనే కారణంతో నిషాను చిన్న వయసులోనే తల్లిదండ్రులు వదిలేశారు. రెండు సంవత్సరాలు అనాథాశ్రమంలో పెరిగింది నిషా. 'స్పెషల్ నీడ్స్ చైల్డ్‌ను దత్తత తీసుకోవాలనుకోవడానికి కారణం...వారికి కొత్త జీవితం ఇవ్వాలనుకోవడం' అంటుంది క్రిస్టెన్ ఫిషర్.

• గుడ్ అండ్ బ్యాడ్

కిడ్‌ఫ్లూయెన్సర్... కిం కర్తవ్యం



యూ ట్యూబ్‌లో కిడ్‌ఫ్లూయెన్సర్‌ల వైరల్ వీడియోలు ప్రవాహంలా కనిపిస్తాయి. క్యాచీ కంటెంట్‌తో లక్షల్లో వ్యూస్ సాధిస్తున్నారు. లక్షల్లో సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. మన దేశంలో కిడ్‌ఫ్లూయెన్సర్‌ల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతుంది. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

తెర వెనుక కథ గురించి చర్చ మొదలైంది. షూటింగ్‌ల కోసం వారు తరచుగా స్కూల్‌కు వెళ్లకుండా ఎక్కువ సెలవులు పెడుతున్నారా? సరిగా తింటున్నారా? తగినంత నిద్ర ఉంటోందా? కంటెంట్‌కు సంబంధించి ఒత్తిడికి గురవుతున్నారా? అందరు పిల్లల్లా సాధారణ జీవితాన్ని ఎంజాయ్ చేయలేకపోతున్నారా... ఇలాంటి సందేహాలు ఎన్నో ఉన్నాయి.

బాగా చదివే పిల్లలు కూడా 'కిడ్‌ఫ్లూయెన్సర్' ట్యాగ్‌లైన్ పుణ్యమా అని చదువులో వెనకబడిపోతున్నారు. 'నేను చాలా సాధించాను. నేను చాలా గ్రేట్' అనే భావన పెరిగిపోతుంది. 'యాభై ఏళ్ల క్రితం అకాడమిక్ ఎక్సలెన్స్ గోల్డ్ స్టాండర్డ్, ముప్పై ఏళ్ల క్రితం ఆటలు ఉండేవి. ఇప్పుడు క్రియేటివిటీ, డ్యాన్స్, మ్యూజిక్, విజువల్ కంటెంట్. ఒక్క వైరల్ వీడియో చాలు పిల్లలకు రాత్రికి రాత్రి స్టార్‌డమ్ తీసుకురావడానికి. ఈ తక్షణ పాపులారిటీ వల్లే పిల్లలు, తల్లిదండ్రులు వైరల్ కంటెంట్‌పై దృష్టి పెడుతున్నారు' అంటుంది కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ డా.మేఘా పుష్కర్ణ.

హెల్త్

• టూత్

ఇంటి పట్టున ఉంటారు పంటి పని పట్టండి...



ఎముకలు పెరుగుతున్న కొద్దీ వచ్చే మార్పులు స్వాభావికమైనవి. అయితే ఎదిగే వయసులో ఉన్న కొందరు చిన్నారులు అలవాటుగా తమ వేలిని నోట్లో పెట్టుకుని థంబ్ సకింగ్ చేస్తుంటారు. ఇది నివారించాల్సిన విషయమే అయినప్పటికీ... పిల్లల సైకలాజికల్ ఎదుగుదల దృష్టితో చూస్తే వారి ఈ అలవాటును బలవంతంగా మాన్పకూడదనీ, క్రమంగా మాన్పించాలని నిపుణులు పేర్కొంటుంటారు. ఇలా ఎముకల పెరుగుదలతో వచ్చే మార్పులతోనూ, నోట్లో వేలుపెట్టుకునే అలవాటు వల్లా పలువరస షేప్ మారవచ్చు.

కొన్ని సాధారణ దంతసమస్యలివి...

• పిప్పిపళ్లు • చిగుర్ల సమస్యలు • పాలపళ్లు సరైన సమయంలో ఊడకపోవడం • ఎత్తు పళ్లు, ఎగుడుదిగుడు పళ్లు, పళ్ల మధ్య సందులతో సమస్యలు • ముఖానికి దెబ్బలు తగలడం వల్ల వచ్చే సమస్యలు.

పిప్పిపళ్లు...

దాదాపు 80 శాతానికిపైగా పిల్లల్లో పిప్పిపళ్లు, చిగుర్ల జబ్బులు కనిపిస్తుంటాయి. తీపి పదార్థాల ముక్కలు నోటిలోనే ఉండిపోవడంతో పెరిగిపోయిన బాక్టీరియాతో పాటు వారు సరిగా బ్రష్ చేసుకోకపోవడం వల్ల ఆ పెరిగిన బ్యాక్టీరియా ఎక్కువ సంఖ్యలో నోటిలోనే ఉండిపోవడం, అవి విడుదల చేసే హానికర రసాయనాల వల్ల పళ్లలో రంధ్రాలు ఏర్పడి పిప్పిపళ్లు రావచ్చు. రంధ్రాల పరిమాణం పెరుగుతున్న కొద్దీ ఆహార వ్యర్థాలు అక్కడ ఎక్కువగా ఇరుక్కుపోవడం, దాంతో రంధ్రం మరింతగా పెరగడంతో పాటు ఇన్ఫెక్షన్స్ వచ్చి నొప్పి రావచ్చు. ఇలాంటి పిప్పిపళ్ల కారణంగా చిన్నారులు ఆహారం నమలడానికి ఇబ్బందిపడతారు. అన్నం తినడాన్ని అవాయిడ్ చేయడానికి ప్రయత్నిస్తుంటారు. తమకు వచ్చే నొప్పిని తల్లిదండ్రులకు సరిగా చెప్పలేక ఇలా అన్నం తినడానికి నిరాకరిస్తుంటారు. దాంతో ఎదుగుదల కూడా ఎంతో కొంత ప్రభావితం కావచ్చు.

చికిత్స...

పిప్పిపళ్లకు సరైన సమయంలో చికిత్స చేయించకపోతే ఇన్ఫెక్షన్ పంటి ఎముక వరకు చేరి, పాల పళ్లతో పాటు తర్వాత రావాల్సిన శాశ్వతదంతాలూ పాడయ్యే ముప్పు పొంచి ఉంటుంది. ఇలాంటి పిల్లలను దంతవైద్యులకు చూపించినప్పుడు వారు పంటిలోని రంధ్రాలను పూడ్చివేయడం, ఇన్ఫెక్షన్‌ను తగ్గించడానికి తగిన యాంటీబయాటిక్స్ ఇవ్వడం వంటి చికిత్సలు చేస్తారు.

చిగుర్ల జబ్బులు...

చిన్నారులకు బ్రషింగ్ నైపుణ్యాలు అంతగా తెలియకపోవడంతో పళ్లలో చిక్కుకున్న ఆహారపదార్థాలను సరిగా శుభ్రం చేసుకోకపోవడం కారణంగా పిప్పిపళ్లతో పాటు చిగుర్ల సమస్యలు వచ్చే ముప్పూ ఉంటుంది. దీనికో కారణముంది. నోట్లో విపరీతంగా పెరిగిపోయిన బ్యాక్టీరియా, ఆహారపదార్థాలతో కలిసి ప్లాక్, క్యాలికులస్ అని పిలిచే మురికి సున్నితమైన చిగుర్ల చివర్లలోకి చేరుతుంది. ఈ మురికి కారణంగా చిగుర్లలో వాపు, కొందరిలో చిగుర్ల నుంచి రక్తస్రావం కావడం, నోటి దుర్వాసన వంటి సమస్యలు కూడా రావచ్చు. చిన్నవయసులోనే చిగుర్ల జబ్బు వస్తే పిల్లలు జీవితకాలం దృఢమైన పళ్లు లేక ఇబ్బంది పడవలసి రావచ్చు.

పిల్లలు ఎదుగుతూ ఉండే సమయంలో అన్ని ఎముకలతో పాటు ముఖానికి సంబంధించిన ఎముకలూ, దవడ ఎముకల్లోనూ మార్పులు వస్తుంటాయి. దాంతో చిన్నారుల్లో ఈ ఎదుగుదలకు సంబంధించిన కొన్ని సమస్యలు కనిపించవచ్చు. అలాగే చిన్నపిల్లలు చాక్లెట్లు, స్వీట్స్, జంక్‌ఫుడ్ వంటివి ఇష్టంగా తింటుంటారు. వేసవిలో కూల్‌డ్రింక్స్ తాగుతుంటారు. ఇవన్నీ నోటి ఆరోగ్యాన్ని దెబ్బతీసేవే. పిల్లల్లో వచ్చే కొన్ని సాధారణ డెంటల్ సమస్యలూ, వాటికి పరిష్కారాల కోసం ఈ కథనం.



చికిత్స...

జింజివైటిస్ వంటి సమస్యలకు తగిన యాంటీబయాటిక్స్ వాడటంతో పాటు చిగుర్లకు వచ్చే సమస్యను బట్టి దంతవైద్యులు పలు రకాల చికిత్సలు అందిస్తారు.

ఎత్తుపళ్లు, ఎగుడుదిగుడు పళ్లు / వంకరపళ్ల వంటి సమస్యలు...

ఎత్తుపళ్లు అన్నది పిల్లలను ఆత్మన్యూనతకు గురిచేసే సమస్య. మొదట్లో ఇది నివారించదగిన సమస్యే అయినప్పటికీ, తల్లిదండ్రుల అవగాహనాలోపం, మరి కొందరిలో వారి నిర్లక్ష్యం వల్ల ఇది తీవ్రమవుతుంది.

ఎత్తుపళ్లు / ఎగుడుదిగుడు పళ్లు / వంకర పళ్లకు కారణాలు...

• ఎత్తుపళ్లు చాలావరకు వంశపారంపర్యంగా వస్తుంటాయి. తల్లిదండ్రుల్లో ఒకరికిగానీ లేదా ఇద్దరికీ ఎత్తుపళ్లు ఉంటే పిల్లల్లోనూ వచ్చే అవకాశాలు 70 శాతానికి పైమాటే. పిల్లలకు ఎత్తుపళ్లు, ఎగుడుదిగుడు / వంకరపళ్లు, పళ్లమధ్య సందులు రాకుండా చేసే చికిత్సలు సైతం ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.

• నోట్లో వేలుపెట్టుకోవడం, పెదవులు కొరకడం, నాలుకతో పళ్లను ముందుకు తోస్తూ ఉండటం, నోటితోనే గాలిపీల్చడం వంటి అంశాలూ ఎత్తుపళ్లకు కారణమవుతుంటాయి. ఎదుగుతున్న చిన్నారుల దవడ ఎముకలు మైనంలా ఒత్తిడి పడుతున్న దిశకు వంగిపోతుంటాయి. ఈ కారణం వల్లనే ఇక్కడ పేర్కొన్న దురలవాట్లు ఉన్న పిల్లల్లో దవడ ఎముకల షేపు మారిపోయి పళ్లు ఎత్తుగా రావచ్చు.

• పాలపళ్లు సమయానికి ఊడిపోకపోయినా, పిప్పి పళ్లను ముందే తీసేయాల్సి వచ్చినా ఎత్తుపళ్లు లేదా ఎత్తు పళ్లు, ఎగుడుదిగుడు పళ్లు రావడానికి ఈ అంశాలు కూడా ఒక కారణం.

ఎదిగే వయసులోనే ఎత్తుపళ్లను, ఎగుడుదిగుడు దంతాలనూ, సరిచేయడం, పళ్ల మధ్యన ఉండే సందులు చక్కదిద్దడం చాలా సులువు. చికిత్స ఫలితాలు కూడా దాదాపు నూరు శాతం ఉంటాయి. ఎదిగే వయసులో వచ్చే 'గ్రోత్ స్పర్' అనేది చికిత్సకు ఎంతగానో ఉపయోగపడుతుంది. చికిత్స త్వరగా, సమర్థంగా జరిగేందుకు ఈ గ్రోత్ స్పర్ అంశం సహాయపడుతుంది.



డా. వికాస్ గౌడ్, డెంటల్ సర్జన్ అండ్ ఇంప్లాంట్ స్పెషలిస్ట్

ఎత్తుపళ్ల సమస్య రెండు రకాలుగా ఉండవచ్చు...

• కేవలం పళ్లు మాత్రమే ఎత్తుగా ఉండటం • పళ్లతో పాటు దవడ ఎముకలు కూడా ఎత్తుగా ఉండటం.

పిల్లలు నవ్వినప్పుడు చిగుర్లు ఎక్కువగా కనిపించడం, నిద్రపోతున్నప్పుడూ పెదవులు తెరచుకునే ఉండటం, పెదవులు ముందుకు వచ్చినట్లుగా కనపడటం వంటివి ఎముక కూడా ఎత్తు పెరిగిందని చెప్పడానికి గుర్తులు.

చికిత్స...

• ఎదిగే వయసులో ఎత్తుగా ఉన్నట్లు గుర్తిస్తే... ఎలాంటి శస్త్రచికిత్సలూ లేకుండానే పళ్లు, దవడలను ప్రత్యేకమైన క్లిప్స్‌తో సరిచేయవచ్చు. అయితే... ఎదిగిన పిల్లల్లో దవడ ఎముకలు ఎత్తుగా ఉంటే సర్జరీ చేయాల్సి రావచ్చు.



• పళ్లు ఎత్తుగా ఉన్నా, పళ్ల మధ్య సందులు ఉన్నా, వంకర టింకరగా ఉన్నా, ఎగుడుదిగుడుగా ఉన్నా క్లిప్పులతో వాటిని సరిచేయవచ్చు. అయితే పిల్లలకు అమర్చాల్సిన క్లిప్పులు అందరిలో ఒకేలా ఉండవు. వ్యక్తిగతమైన పరీక్షల తర్వాతే వారికి సరిపోయేవాటిని నిర్ణయించాల్సి ఉంటుంది.

పాలపళ్లు సరైన టైమ్‌లో ఊడకపోవడం...

సాధారణంగా పాలపళ్లలోని ప్రతి పన్నూ ఓ నిర్దిష్ట సమయం తర్వాత ఊడుతుంది. శాశ్వత దంతం తయారై బయటకు రావడానికి సిద్ధంగా ఉన్నప్పుడే పాలపన్ను ఊడుతుంది. ఊడిన 3 నుంచి 4 నెలల్లో శాశ్వత దంతం వచ్చేస్తుంది. ఏ కారణం వల్లనైనా పాలపన్ను ఊడకపోతే, దానికి ముందువైపో, వెనకవైపు నుంచో శాశ్వత దంతం వస్తుంది. (కొన్నిసార్లు పాల పన్ను ఊడకపోవడం వల్ల శాశ్వత దంతం బయటకు రాలేక చిగురులోనే చిక్కుకుపోవచ్చు కూడా). దాంతో రెండు వరసల్లో పళ్లు కనపడతాయి. అందుకే ఆరేళ్లు దాటిన పిల్లలను దంతనిపుణులకు తరచూ చూపిస్తూ పాలపళ్లు సరైన సమయంలోనే పడిపోతున్నాయా లేదా అని పరీక్ష చేయిస్తూ ఉండాలి. అవసరాన్ని బట్టి వారి పర్యవేక్షణలో చికిత్స చేయించాలి.

పరీక్షలు : ఎక్స్‌-రే సహాయంతో పాలపళ్లు, శాశ్వత దంతాలను, శాశ్వతదంతాలను చిక్కుకుపోయిన తీరును దంతవైద్యులు తెలుసుకోగలరు.

ముఖానికి దెబ్బలు తగలడం వల్ల...

ఎదిగే పిల్లలు ఆటలాడుతుంటారు. పైగా ఇవి సెలవురోజులు కావడం ఆడుకోవడం మరింత ఎక్కువ. ఆటల్లో పరుగెత్తుతూ పడిపోవడం, దెబ్బలు తగలడం, క్రికెట్ బంతి లేదా ఇతర బంతుల వంటివి తగలడం, పిల్లలు పోట్లాడుకోవడం వంటి చర్యలతో ముఖానికి దెబ్బలు తగలడం, పళ్లు విరగడం / వంగిపోవడం, దెబ్బలు తీవ్రమైనవైతే పెదవులు చీలడం, ముక్కు వంకర కావడం కూడా జరగవచ్చు.

ఇలా దెబ్బలు తగిలినప్పుడు వెంటనే చికిత్స చేయించాలి. నిర్లక్ష్యం చేస్తే పలువరస షేపు మారడం, పళ్లపై గుర్తులు ఏర్పడి అలాగే ఉండిపోవడం జరగవచ్చు. అందుకే పన్ను విరిగినా, ఊడినా వెంటనే ఆ ముక్కను పాలలో లేదా మంచినీళ్లలో ఉంచి దంతవైద్యులను కలవాలి.

వేసవి సెలవులు దంతవైద్యం చేయించడానికి అనువైన సమయం. ఈ సమయంలో స్కూళ్లకు సెలవులు ఉంటాయి కాబట్టి పిల్లల చదువులు వృథా కాకుండానే చికిత్స చేయించవచ్చు. పైగా చికిత్స తర్వాత వారు ఇంటిపట్టునే ఉంటారు కాబట్టి టైముకు మందులు ఇవ్వడానికి, తగిన జాగ్రత్తలు తీసుకోడానికి, పిల్లలకు తగినంత విశ్రాంతి ఇవ్వడానికి సెలవులన్నవి సరైన సమయం. కాబట్టి తల్లిదండ్రులు ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని, పంటి సమస్యలున్న పిల్లలకు తగిన వైద్యసహాయం అందించవచ్చు.



• ఫుడ్

...జంకొద్దు

వేసవిలో పిల్లలకు ఆహారం ఇవ్వాలంటే రెండు అంశాలు గుర్తుపెట్టుకోవాలి. మొదటిది వేసవి వేడిమి. రెండోది సెలవుల్లో వాళ్ల ఆటలు. నగరాల్లోని పిల్లలు ఎండల్లో పెద్దగా ఆడే అవకాశం లేకపోయినా పట్టణాల్లో, పల్లెల్లోని పిల్లలు ఇలా ఎండ వేడిమిలో ఆడటం మామూలే. అలాగే పెద్ద నగరాల్లోని సెలవులకు పల్లెలకు వచ్చే పిల్లల సంఖ్య తగ్గినప్పటికీ... కొంతమంది ఇప్పటికీ ఇలా వచ్చేవారు లేకపోలేదు. ఇలా వేసవిలోని వేడిమిని తట్టుకుంటూ... ఎక్కువ సమయం ఆటలకు ఇచ్చుకుంటూ ఉండేందుకు అవసరమైన శక్తిని సమకూరుస్తూ ఉండటానికి చిన్నారులకు ఎలాంటి ఆహారం ఇవ్వాలో తెలిపే కథనం.



• అధిక శక్తికోసం పాల ఉత్పత్తులు...

పిల్లలకు తాజా లస్సీ, తాజా మజ్జిగ, ఫ్లేవర్డ్ మిల్క్, ఫ్రూట్ మిల్క్ షేక్‌లు (మ్యాంగో మిల్క్ షేక్) వంటివి ఇవ్వడం వల్ల ఒకపక్క అవి ద్రవాహారాలుగా వారు కోల్పోయే నీరు లవణాలను భర్తీ చేయడంతో పాటు ప్రొటీన్లనూ అందజేస్తాయి. ఎదిగే వయసులో ఎముకల బలం కోసం క్యాల్షియమ్‌ను ఇస్తాయి.

• తాజా పండ్లు... పిల్లలకు తాజా పండ్లు తినిపించడం ఎప్పుడూ మంచిదే. కాకపోతే పండ్ల రసాలకు బదులు వీలైనంతగా పండ్లను కొరికి తినేలా చూడాలి. ద్రవాలను భర్తీ చేయడం కోసం, వేసవి ఉపశమనం కోసం అప్పుడప్పుడూ చల్లగా ఉండే తాజా పండ్ల రసాలనూ ఇవ్వవచ్చుగానీ... వీలైనంత వరకు వాటిలో చక్కెర కలపకపోవడం మంచిది.

• జంక్‌ఫుడ్ వద్దు... బర్గర్‌లు, పిజ్జాలు, చిప్స్ వంటి వాటి కోసం వాళ్లు మారాం చేస్తున్నప్పటికీ ఆరోగ్యానికి అవి హానికరమంటూ వాళ్లను సముదాయించడం మంచిది. ఆ వయసు పిల్లలను సమాధానపరచడం కష్టం కాబట్టి వాటిలో పనీర్, తాజాకూరగాయలు పుష్కలంగా నింపి ఇవ్వడం మంచిది. అయితే వాటిల్లో చీజ్ ఎక్కువగా ఉన్నవాటిని తినిపించడం అంతగా మంచిది కాదు. మరీ మారాం చేస్తుంటే గ్రిల్డ్ వెజిటబుల్స్‌ను పనీర్‌తో కలిపి ఇవ్వవచ్చు.

• ఐస్‌క్రీముల విషయంలో...

వేసవిలో ఐస్‌క్రీములు అడగని పిల్లలు ఉండరు. ఇంట్లో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లు, ఫ్రూట్ కస్టర్డ్స్, పుడింగ్స్, స్మూతీస్ వంటివి పిల్లలకి పెట్టవచ్చు. ఇవి ఆరోగ్యకరమే. ఇక కూల్ డ్రింక్స్ కోసమూ డిమాండ్ ఎక్కువగానే ఉండవచ్చుగానీ వాటిని ఇవ్వడం అంతమంచిది కాదని గుర్తుంచుకోండి